

కోకా శ్రీసుధ

ప్రాణి ఈ లోకం వదలివేసింతర్వాత—ఎక్కడికి వెళ్తుందీ అన్న అనుమానం, విజ్ఞానం అనే మాట మనకు తెలిసిన దగ్గరనుంచి చర్చించుకుంటున్నాము. నశించేది శరీరమే కాని, ఆత్మ కాదని అందరూ అంటారు. కాని, ఆ ఆత్మ టెంపరరీగా ఎక్కడన్నా మకాంవేసి, మళ్ళీవేకెన్సీ వచ్చినప్పుడు, భూలోకంలోకి వస్తుందా? లేక పోతే పర్మనెంటుగా ఆకాశంలో, భూమ్యాకర్షణ పరిధిని దాటి, స్పుత్నిక్‌లాగా, భూమిచుట్టూ తిరుగుతుందా? అని నాకు కలిగిన సందేహాలు.

ఏదేమైనా, నశించేది శరీరమేకాని ఆత్మ కాదని అనేవాళ్ల వాదనకు తార్కాణంగా వెలిశాయి దెయ్యాలు. దెయ్యాలనగానే, మళ్ళీ ఉన్నాయా—లేదా అనే వాదన వస్తుంది. మొన్న మొన్నటి వరకూ, దెయ్యాలులేవని నిరూపించటానికి, ఎనాటమీ రూములో శవాల మధ్య మస్తుగా నిద్ర పోయిన, మా వెంకట్రావు ఈ నాడు అవి ఉన్నాయంటున్నాడు...

డాక్టర్ వెంకట్రావుకు పెళ్ళయిన సంవత్సరమే ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎం.డి.కి సీటు వచ్చిందనగానే, పెళ్లాం సీత అదృష్టం అన్నారు అంతా. కాని, 'అతనేమో నా దురదృష్టం' అనుకున్నాడు.

సీత ప్రోద్బలంవల్ల, హైద్రాబాద్‌లోని పేపరులో, ఊరికి దూరంగా, గారేజీ ఉన్న బంగళా కావాలి అని ప్రకటన వేయించాడు అయిష్టంగానే.

వారం తిరిగేసరికల్లా, పటంతోసహా సమాధానం వచ్చింది. ఉస్మానియా ఆస్పత్రికి రెండు మైళ్ల దూరంలో, గోల్కొండకు వెళ్లేదారిలో మామిడితోటలో ఉందట ఒక బంగళా, అంతా కలిసి నెలకు రెండు వందలట..

ఇది చదివి "ఈ ఇల్లు తీసుకుందాం అండీ" అంది, పటం చూస్తున్న వెంకట్రావు భుజం మీ చేయివేసి.

"ముందసలు యిల్లు చూసి, బాగుంటే, నిన్ను తీసుకు వెళ్తా. ఏం?" అన్నాడు అతను.

"అమ్మ బాబోయ్!అంతవరకూ నేనీవూళ్లో ఒకత్తి ఉండనా?" అంది సీత.

"ఒకపనిచేయి—నిన్నేమో అనపర్తిలో దిగబెడతా—నేనేమో హైద్రాబాద్ వెళ్లి ఇల్లు చూసుకుని, బాగుంటే నిన్ను తీసుకుని వెళ్తా ఏం?" అన్నాడు వెంకట్రావు.

"సరేనండి. ఇవ్వాళే బయలుదేరండి. చాలా మంచి రోజు" అంది.

"లేడికి లేచిందే పరుగంట" అన్నాడు వెంకట్రావ్.

"లేకపోతే తాబేలులాగా నడుస్తుందా లేడి?" అని అడిగింది సీత గంభీరంగా.

"హా! చంద్రమతీ అని మూర్ఛిల్లను"—అని మూర్ఛిల్లాడు వెంకట్రావు.ఎలాగైతేనేం హైద్రాబాద్ చేరుకునేసరికి, సాయంత్రం అయిదు అయింది వెంకట్రావుకు. ఆ ఇంటి యజమాని దగ్గిర తాళంచెవి తీసుకున్నాడు.

పోతూ పోతూ కారియర్‌లో భోజనం పెట్టించుకుని కొంతదూరం వెళ్లేసరికి, 'అయ్యో ఇవ్వాళ శనివారం కదూ!' అనుకుని మళ్లీ ఇంకో హోటలు దగ్గర కారాపి, పూరీలు పార్శిలు చేయించుకుని, ఫ్లాస్కుని కాఫీతో నింపి, బయట "కేలేవాలీ" కనపడితే ఒక డజను అరటిపళ్లు కొనుక్కుని, మళ్లీ కారు ఎక్కాడు. ఇంటి యజమాని గుర్తులు ఆంజనేయదండకంలా చదువుకుంటూ, ఇల్లు పట్టుకునే సరికి 8—0 అయింది. బయట గేటుకీ, ఇంటి గుమ్మం మధ్యా కాంక్రీటు రోడ్డు వేశారు. ఆ కాంక్రీటు రోడ్డుకు ఎడం ప్రక్కగా ఒక నలభై గజాల దూరంలో కారు గారేజీ ఉంది.

కారు ఇంటి ముందుపెట్టి, తలుపు తాళంతీసి, లోపలికి వెళ్లాడు అతను. లైటు స్విచ్ వెతుక్కుని, లైటువేశాడు.

అది డ్రాయింగ్ రూము. కుర్చీలు బల్లలు మీద దుమ్ము పడకుండా గుడ్డలు కప్పారు.

అతను ఇల్లంతా చూసి, బెడ్‌రూములోకి వచ్చి, బెడ్‌మీద గుడ్డను తీసే సరికి వాడిన గులాబీ పువ్వు కనపడింది. 'పాపం! అన్నీ తీసుకువెళ్లిన వాళ్లు దీనిని ఎందుకు తీసుకు వెళ్లలేదూ?' అని అనుకుని, పారవేయబోయి, 'పోనీలే ప్రొద్దున్నే పారేద్దాం' అని అనుకుని ప్రక్కనున్న డ్రెస్సింగ్



*శాస్త్రానికి లొంగక, మానవుని విజ్ఞానం పరిమితమైనదని చాటేవి అనేకం. అనుభవైకవేద్యం. ఆ అనుభవానికి సమయ సందర్భాలు ఆధారం. కాదనడానికి కూడా వీలులేదు.*

# ఖైదీ నం. 363

టేబిల్‌మీద పెట్టాడు.

బయటకు వెళ్లి, గ్లాసులు, ఫ్లాస్కు, పూరీల పాకెట్ తీసుకు వచ్చి, భోజనాల హాలులోకి వెళ్లి ఫలహారంచేసి, మంచినీళ్లు త్రాగి, గ్లాసులను శుభ్రంగా కడిగి, భోజనాల టేబిల్‌మీద పెట్టి, కాఫీ తర్వాత త్రాగుదాంలే, అనుకుని సిగరెట్టు వెలిగించి, సీతను తలుచుకుంటూ మంచం మీద పడుకున్నాడు, సిగరెట్టు పారేసి. "హా సీతా! ఈ టైముకి నీవేం చేస్తుంటావో కదా!" అని కళ్లు మూసుకున్నాడు. అతనికి తెలియకుండా నిద్ర పట్టేంది.

హారన్ కొట్టేన చప్పుడు వినిపించి గబుక్కున లేచా డతను.

హోరున వర్షం కురుస్తున్నచప్పుడు వినిపించిందతనికి. గంట చూచుకున్నాడతను.

ఒంటిగంట అయింది.

లేచి బయటికి వెళ్లిచూచాడు.

ఉరుములతో మెరుపులతో ఉధృతంగా కురుస్తున్నది వర్షం.

తళుక్కుమని మెరిసిందొక మెరుపు. ఆ వెలుగులో గేటుకు అవతల, ఒక కారు ఆగి ఉండటం చూచాడు.

అసలు సంగతి ఏమిటో చూద్దామని వెళ్లాడు.

అమ్మాయి కనపడింది.

కారు బాయ్‌నెట్ ఎత్తి—ఇంజనులో దేన్నో కెలుకుతున్నది.

"గుడ్ ఈవినింగ్! ఏం జరిగిందీ?" అన్నాడతను.

"ఓహ్! చూడండీ. అకస్మాత్తుగా ఆగిపోయింది" అంటూ సమాధానం ఇచ్చిందా అమ్మాయి గజగజా వణుకుతూ.

"నన్ను కొంచెం చూడనీయండీ" అన్నాడతను.

"థాంక్సు!" అని ఆమె ప్రక్కకు తప్పుకుంది.

అతను ఇంజను చూసి, "అంతా బాగానే ఉన్నట్లుగా ఉంది. పెట్రోలు అయిపోయిందేమో చూచారా?" అని అడిగాడు.

"వండర్‌ఫుల్! మీరు మెకానిక్కా?" అని అడిగింది ఆ అమ్మాయి.

"కాదు" అన్నాడు.

"కాకపోతే మెకానిక్ మెదడు ఉండిఉండాలి" అని అంది.

"ఇదిగో చూడండి, హోరున వర్షంలో ఇలా ఇంకో గంట నిలబడితే న్యుమోనియా వచ్చి, ఇద్దరిలో ఒకరు తారున క్రిందబడి చచ్చిపోతాం"—అన్నాడతను.

"అదిగో అటు చూడండి", అని ఆ అమ్మాయి రోడ్డు వైపుకు చూపించింది.

దూరంగా చీకటిని చీల్చుకుంటూ, వస్తున్నాయి, రెండు దీపకాంతులు.

"ఆదీపాలు వేటివై ఉంటాయి అంటారూ?" అని అడిగింది.

"లారీవి అనుకుంటా" అన్నాడు వెంకట్రావు.

అనుకున్నట్లుగానే ఆ దీపాలు లారీవే.

# ఖైదీ నంబరు 363

రోడ్డుకు అడ్డంగా కారు ఆగిఉండటం వల్ల, లారీ ఆగిపోయింది.

లారీలోంచి డ్రైవరు దిగాడు.

"క్యా హువా సాబ్? — అన్నాడతను. బాగా లావుగా ఉన్నాడు.

"మేడమ్. నా మాట వింటారా కొంచెం. విషయాలన్నీ తర్వాత ఆలోచిద్దాం. ముందీ వర్షం లోంచి తప్పుకోవాలి అంటే ఒకటే మార్గం.; ఇంట్లోకన్నా వెళ్ళాలి, లేకపోతే మీ కారులోనన్నా కూర్చోవాలి. ఏది మీకిష్టం?" అని అడిగాడు వెంకట్రావు వినుగుతో.

"సారీ! మీకు ఇబ్బంది కలిగిస్తున్నా. ఇంట్లోకే వెళ్దాం రండి" అంది ఆమె.

"నువ్వుకూడా పదవోయ్—ఫ్లాస్కులో కాఫీ ఉంది త్రాగి పోదువుకానీ" అన్నాడు వెంకట్రావు లారీ డ్రైవరును చూచి.

"మాఫీ కరనా సాబ్! కాఫీ మై నై పీతా" అన్నాడు డ్రైవరు.

"అయితే వెళ్లిపోతానంటావా?" అని అందామె.

"జీ!" అన్నాడు లారీ డ్రైవరు.

"అయితే ఒక పనిచేద్దాం. కారును ప్రస్తుతం గారేజీలో పెట్టేసిన తర్వాత, నేనూ నీతో వచ్చేస్తా—ఊళ్లోకి వెళ్లి ఉదయమే పెట్రోలు పట్టుకురావచ్చు. ఏం?" అంది ఆమె.

ఆమె అలా అనామకుడితో అర్ధరాత్రి, కారును వదలి, ఊళ్లోకి వెళ్లిపోవటానికి ఎందుకు ఆత్రుత పడుతుందో వెంకట్రావుకు అర్థం కావటంలేదు.

ఎలాగైతేనేం వెళ్లారు ముగ్గురూ ఇంట్లోకి.

తువ్వాళ్లు యిచ్చాడు వారి ఇద్దరికీ... వాటితో తల తుడుచుకున్నారు వారిద్దరూ.

డ్రైవర్ చేతికి తొడుగులు తొడుగుకొని ఉండటంచూసి "ఏమోయ్, నీకు గ్లవ్స్ వేసుకోవడం అలవాటా?" అని అడిగాడతను.

"జీ సాబ్! రాత్ మే సర్దీ లగ్తీ నా-" అన్నాడు డ్రైవరు.

"అచ్చి"—అని తుమ్మిందా అమ్మాయి.

"చూశారా—వర్షంలో తడిస్తే అంతే" అన్నాడు ఫ్లాస్కులో ఉన్న కాఫీని మూడు గాజు గ్లాసులలోకి పర్దుతూ.

"మీ కారును గారేజీలో పెట్టొద్దూ!" అన్నాడు వెంకట్రావు.

"ఆప్ యహీరహియే సాబ్, మేరే సాత్ క్లీనర్ హై, దోనో మిల్కే కామ్ కరేంగే"—అంటూ డ్రైవర్ కిల్ట్ (టోపి) నెత్తిమీద పెట్టుకుని బయటకు వెళ్లిపోయాడు.

"మీకు నా కృతజ్ఞత ఎలా తెలపాలో తెలియకుండా ఉంది" అందామె కాఫీగ్లాసును టీపాయ్ మీద పెడుతూ.

"అబ్బే! ఫరవాలేదు" అన్నాడతను.

"మీ సోఫాలన్నీ పాడుచేశాను నా తడిబట్టల తోటి" అందామె.

"అబ్బే. ఫరవాలేదు, ఫానువేసి ఉంచితే అన్నీ ఆరిపోతాయి."

ఇంతలో గడియారం ఠంగు, ఠంగు, ఠంగుమని మూడు కొట్టింది.

"రఖ్ దియా మేమ్ సాబ్!"— అంటూ వచ్చాడు డ్రైవరు.

"అబ్బా!" అని, "వస్తామండీ. మళ్లీ ఉదయమే కనపడతా. మీరెక్కడికీ వెళ్లరు కదూ?"—అని అడిగిందా అమ్మాయి.

"12—0 గంటల వరకూ ఎక్కడికీ వెళ్లను" అన్నాడు వెంకట్రావు.

"అయితే గుడ్ నైట్!" అందామె లేస్తూ.

లారీ కదిలేదాకా ఆ వర్షంలోనే నిలబడ్డాడు.

వాళ్లు వెళ్లిపోయారు.

అతను లోపలికి వచ్చి, బట్టలు మార్చుకుని, రగ్గు కప్పుకుని పడుకున్నాడు.

ఒక అరగంట నిద్రపట్టక అటూ ఇటూ దొర్లాడు. ఇంతలోకే గుర్తుకు వచ్చింది, తనకారు ఇంతసేపూ వర్షంలోనే తడుస్తున్నదని.

గబగబా లేచి, తువ్వాలు తలమీద వేసుకుని, బయటకు వచ్చి, కారును స్టార్టుచేసి, గారేజి దగ్గరకు తీసుకు వచ్చాడు. అప్పుడు గుర్తుకు వచ్చింది, గారేజీలో ఆ అమ్మాయి కారు ఉందికదా అని.

కిందికి దిగి గారేజీ తలుపుతీసి, లైటు వేశాడు.

లోపల ఓల్డు మోడల్ ఫోర్డు కనపడింది.

మళ్లీ లైటు ఆర్పేసి, గారేజీ తలుపు తాళం వేసి, తన కారును ఒక మామిడిచెట్టు క్రింద పెట్టి, లోపలికి వెళ్లి దీపాలు ఆర్పి పడుకున్నాడతను.

మళ్లీ అతను లేచేసరికి ఉదయం పది అయింది.



కూటికి

చిత్రం—సి. చిన్నారావు (మద్రాసు-12)

'మై గాడ్, సాంబార్ ఇడ్లీకోసం మళ్లీ నాలుగు మైళ్ళు వెళ్లాలా?' అనుకుంటూ కిటికీ తలుపులు తీశాడు.

వర్షం వెలిసింది.

కాల్యకృత్యాలు తీర్చుకున్నాక, బట్టలు వేసుకుని బయటకు వచ్చాడు వెంకట్రావు.

మామిడి చెట్టుక్రింద ఉన్నకారు కనపడగానే, రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

గబగబా గారేజి దగ్గరికివెళ్లి తలుపులు తీశాడు.

గుండెలు గుభేలు మన్నాయి అతనికి.

లోపల కారు లేదు. కనీసం రాత్రి కారు పెట్టినట్లుగా ఆనవాళ్లు కూడా లేవు.

ఒక పదినిమిషాలు, నిరుత్తరుడై నిలబడ్డాడతను.

ఒకవేళ ఇదంతా కలేమో అనుకున్నాడు.

అనుమాన నివృత్తికోసం, లోపలికి వెళ్లాడు.

టీపాయిమీద వాళ్ళు త్రాగివెళ్లిన కాఫీగ్లాసులు కనపడ్డాయి. ఏది నమ్మాలో అతనికి అర్థం కాలేదు.

జాగ్రత్తగా ఆ గ్లాసులు గుడ్డలో చుట్టి క్రైంబ్రాంచికి వెళ్లాడు.

అక్కడ అతనికి డాక్టర్ కిషోర్ కనపడ్డాడు.

"ఒరేయ్ బావా—నీ విక్కడికి ఎందుకు వచ్చావు? ఏమన్నా ఖూనీ చేశావా?"—అన్నాడు కిషోర్.

"ఖూనీకాదురా బావా. అంతపని జరిగింది. అసలింతకీ నీవిక్కడ ఎందుకున్నావ్?" అని అడిగాడు వెంకట్రావు.

"నే పోలీస్ డాక్టరు ని రా ఇక్కడ" అని అన్నాడు తను.

"వెరీగుడ్.అయితే కూర్చో" అంటూ జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

కథంతా విన్నాక "పద ఆ గ్లాసుల మధ్య వేలిముద్రలుపాత కేడీలవేమో చూద్దాం" అని లోపలికి తీసుకు వెళ్లాడు—వెంకట్రావును కిషోర్.

వేలిముద్రలు ఉన్న గ్లాసులు ఆ శాఖలో ఇచ్చి, బయటకు వచ్చి సిగరెట్టు కాల్చుకుంటూ నిలబడ్డారు.

ఇంతలోకే ఒక కానిస్టేబుల్ వచ్చి "సార్, మిమ్మల్ని సూపరెంటు గారు పిలుస్తున్నారు" అన్నాడు.

ఇద్దరూ ఆఫీసు రూములోకి వెళ్లారు. ఎస్.పి. కుర్చీలు చూపించి "కూర్చోండి" అన్నారు.

ఇద్దరూ కూర్చున్నారు. వాళ్ళు కూర్చున్నాక "మీకీ వేలిముద్రలు ఎక్కడ దొరికినాయి?" అని అడిగారాయన వెంకట్రావును.


మళ్లీ కథంతా చెప్పాడు.

"ఇంపాసిబుల్"—అన్నారాయన.

"అదేం?—" అన్నాడు కిషోర్.

"ఎందుకంటే, ఈ వేలు ముద్రలుగల వ్యక్తి పేరు శాంతకుమారి. ఖైదీనంబరు 363. తన అందంతో జాగీర్దార్లనూ, బడాబడాశేట్లను మోసగించి చీకటి పడగానే, వాళ్ల కారు వేసుకుని పారి

(తరువాయి 56 వ పేజీలో)



# చదవదగిన పుస్తకాలు

## రాగరేఖలు

*[రచన: శ్రీ జి. వి. కృష్ణరావు. పేజీలు 200. వెల మూడు రూపాయలు. ప్రచురణ: ప్రజా ప్రచురణలు, పవరుపేట, ఏలూరు.]*

**తమ** ఉనికిని ఒకరు గుర్తించలేని విధంగా ప్రవహించే నదులు కొన్ని. పడుతూ లేస్తూ, పరవళ్లు త్రొక్కుతూ త్రొక్కిస్తూ అంది నంతమేర. అంతా కదలించివేస్తూ ప్రవహించేవి మరికొన్ని. రెండవరకం మాత్రమేకాదు, మొదటి రకానికి చెందినవికూడా మనకు ఏదో చెప్పడానికే ప్రయత్నిస్తూంటవి. ఆ కోవకు చెందినదే 'రాగరేఖలు'.

సమాజ జీవులన్నా సమాజప్రభావం అంతో యింతో పడుతుంది. సమాజంలో ఉంటూ, సమాజ ప్రభావానికి లొంగక తమ జీవితాలు తామే గడుపుకొనేవారు అరుదుగా ఉంటారు. కొందరు అదృష్టవంతులు సమాజంలో అంతగా నిమిత్తంలేకుండా తమ జీవితాలను సరిదిద్దుకొంటారు. ఈ సమాజం అన్న పదాన్ని విస్తృతార్థంలోనే ఉపయోగిస్తున్నాను.

అలాంటి అదృష్టవంతులలో చేరినవారే 'రాగరేఖలు' లో దర్శనమిచ్చే గుణవర్ధనుడు, చిత్ర, ధర్మ కీర్తి. అనురాగ విరాగాలకు సంభవించే సంఘర్షణ పరిణామమే ఇందలి ఇతివృత్తం.

జాతి మత కుల భేదాలకు అతీతం కాగలిగిన మానవత్వం రూపొందాలంటే మనిషిలో వికాసం కలగాలి. మనిషి పెరగాలి.

జాతిభేదం నశించాలి. ఎలా? సరిసమానంగా అంగీకరించలేని జాతిలో ఏదో ఒకవిధమైన సంబంధం, అనుబంధం ఉండడం, దానిని అంతిమంగా తెలుసుకొనడంలో పరివర్తన కలగడం ద్వారామాత్రం కాదు. మనిషిని మనిషిగా అర్థం చేసుకుని అంగీకరించే స్థితి చేరుకొనడం ఒక్కటే ఉత్తమమైన మార్గం. అలాంటి పరిణామం తీసుకొని రావడానికి రచయిత యత్నించి ఉంటే 'రాగరేఖలు' మరింతగా పాఠకుల మనసులను ఆకట్టుకొని ఉండేది.

—రాజు ★

## పస్పశాహ్నికము
### ఆంధ్రానువాద సహితము

*[అనువాదకుడు: శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్యులు, సంస్కృతోపన్యాసకులు, గవర్నమెంట్ ఆర్ట్సు కాలేజి, రాజమండ్రి. పుటలు 64 వెల: 1-50. ప్రాప్తిస్థానం: అనువాదకుడు.]*

**వ్యాకరణమంటే** ఈనాడు ఎందుకో అందరికీ వైరస్యం కలుగుతున్నది! పదస్వరూపం తెలుసుకొని, పదపదార్థ వాక్య సంబంధంతో ప్రయోగించడమే వ్యాకరణం. మనం మనకు తెలియకుండానే వ్యాకరణయుక్తంగా వ్యవహరిస్తున్నాము. "రెండు పుస్తకాలు ఉంది" అని కాని, "పదుగురు తింటున్నది" అని కాని లింగ వచన వ్యత్యయంతో పిచ్చివాళ్లు తప్ప వాడరు. మన అభిప్రాయం ఎదుటివారికి అవగతం కావడమేకదా భాష ఉద్దేశం? ఆ ఉద్దేశం నెరవేరడానికి మన మాట స్పష్టంగా, లోకంలో అదివరకు ఉన్న పలుకుబడిని బట్టి కార్యకారణ సంబంధంతో ఉండవలసి ఉంటుంది. ఈ విషయం ఎంత విశదంగా మనం తెలుసుకుంటే అంత సార్థకంగా మనం మాటలు వినియోగించగలుగుతాము; భావస్ఫూర్తి తిరుగులేకుండా ఉంటుంది.

వ్యాకరణం ఎందుకు? దాని ప్రయోజనమేమిటి? అసలు వ్యాకరణమంటే ఏమిటి?—అనే కుశంకలు చెవిని పడడంవల్లనే కాబోలు రెండువేల ఏళ్లనాడే పతంజలి మహర్షి పాణిని అష్టాధ్యాయికి భాష్యం రచిస్తూ, ప్రారంభంలోనే వీటన్నిటికీ సమాధానమిచ్చారు. ఆ సమాధానాలు — వైదిక భాషకు సంబంధించినది మినహాగా — నేటికీ వర్తిస్తాయి. ఆ సమాధానాలున్న భాగాన్ని 'పస్పశాహ్నికం' అన్నాడు పతంజలి.

దానికిది సరళాంధ్రానువాదం. శ్రీ శ్రీభాష్యం అప్పలాచార్యులు వ్యాకరణ విద్యాప్రవీణులు. ఆ భాగాన్ని అనువదించి నేటివారి కుశంకలను పోగొట్టడానికి ప్రయత్నించడం హర్షణీయం.

—రామచంద్ర ★

## ఖైదీ నంబరు 363

( 38 వ పేజీ తరువాయి)

పోయి దూరంగా ఎక్కడో వదలి మాయమయ్యేది. తమ పేరు బయటపడుతుందేమోనన్న భయంతో వాళ్ళు బయటపెట్టేవాళ్ళుకాదు. కళ్యాణరావు అనే జాగీర్దారునుమోసంచేసి పారిపోతూ, కారును గోల్కొండ పరిసర ప్రాంతాల్లో వదిలేసి, లారీలో పారిపోతూ, ఆ లారీ ప్రమాదంలో మరణించింది" అని ఒక ఫైలును కిషోరుకు అందించాడు.

"అయితే ఆ లారీకి ప్రమాదం జరిగిందన్న మాట" అని అన్నాడు వెంకట్రావు.

"అవును. డ్రైవరుకు, శాంతకుమారికి మెడ విరిగి పోయింది. క్లీనరుకు తల చితికిపోయింది."

ఆయన ఇంకా ఏమో చెప్పబోతుండగా "ఆ దేహాలు ఆస్పత్రిలోనే ఉన్నాయా?" అని అడిగాడు వెంకట్రావ్.

"వాట్ డాక్టర్?—ఈ కథ జరిగి 25 సంవత్సరాలయింది" అన్నాడు కిషోర్, ఫైలును మూసి.

"నో, నో! నేను ఆవిడను రాత్రే చూశాను" అన్నాడు వెంకట్రావు.

"సారీ! నీవు ఆవిడ దయ్యాన్ని చూసి ఉంటావు"—అన్నాడు కిషోర్.

"ఛట్!—దయ్యాలూ లేవూ, భూతాలూ లేవూ" అంటూ లేచి మళ్లీ ఆ కుర్చీలోనే పడి పోయాడు వెంకట్రావు.

అతన్ని ఆస్పత్రిలోకి తీసుకువెళ్లి చేర్చారు. ఆ సంవత్సరం అతని ఎం.డి. చదువు ఆగిపోయింది.

ఈ నాటివరకూ, అతని అభిప్రాయం తానా రాత్రి చూసింది అసలు శాంతకుమారినేఅని, లేకపోతే వాళ్ల వేలు ముద్రలు గ్లాసుమీదకు ఎలా వస్తాయీ—అని. ★

Printed and Published by S. V. Swamy B.A., on behalf of Andhra Prabha Ltd. and Printed at Dinamani Press, Mount Road, Madras and Published at Gandlapalli, Chittoor. Editor: Neelamraju Venkataseshaiah.